


అడ్డగూడూరు : సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

## బునాదిగాని కాల్వ పూర్తిచేసే బాధ్యత నాదే

**• తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్**

అడ్డగూడూరు, జూలై 19 : అడ్డగూడూరు, మోత్కూరు మండలాలకు గోదావరి జలాలు తెచ్చేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు, బునాదిగాని కాల్వ పాటిమట్ల వరకు వచ్చి ఆగిపోయిందని త్వరలో పూర్తి చేసే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అధికారులు అలసత్వం వీడి పని తీరు మార్చుకోవాలని లేనియెడల కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళా సంఘాల ఏర్పాటులో అలసత్వం వహించిన ఏపీఎం వెంకటేశ్వర్లుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గొర్రెల పంపిణీ మొదటి విడుతలో డీడీలు కట్టినవారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఏయే గ్రామాలకు సీసీ రోడ్లు అవసరమో గుర్తించి ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద వేయాలని సూచించారు. ఎంపీపీ దర్శనాల అంజయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తాసీల్దార్ దశరథనాయక్, ఎంపీడీఓ చంద్రమౌళి, జడ్పీటీసీ శ్రీరాముల జ్యోతీఅయోధ్య, సింగిల్ విండో చైర్మన్ పోన్నాల వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ దైద పురుషోత్తంరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### పలు కుటుంబాలకు పరామర్శ

అడ్డగూడూరు : మండలంలోని డి.రేపాక గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బైరు లింగయ్య తండ్రి నర్సయ్య అనారోగ్యంతో ఇటీవల మరణించాడు. అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రాపోలు శ్రీను తల్లి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ దైద పురుషోత్తంరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ తీపిరెడ్డి మేఘారెడ్డి, నాయకులు కంచర్ల చలపతిరెడ్డి, శ్రీరాముల అయోధ్య, పూలపల్లి జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

### అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మోత్కూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నదని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. మున్సిపాలిటీ కేంద్రంలో రూ.1.30 కోట్లతో బృందావన్ కాల్వ ఆధునీకరించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేయనున్న రూ.లక్ష సాయానికి మండలంలో 417 మంది కుల వృత్తిదారులు దరఖాస్తులు చేసుకోగా 413 మంది అర్హులుగా తేలినట్లు చెప్పారు. వారిలో 71 మందికి రుణ సాయం అందించనున్నట్లు, మొదటి విడుతగా మున్సిపాలిటీలో 16 యూనిట్లు అలాగే మండలంలోని ఆయా గ్రామాలకు 14 యూనిట్లు కేటాయించినట్లు తెలిపారు. దళిత బంధు కింద నియోజకవర్గానికి 1,100 యూనిట్లు మంజూరైనట్లు వెల్లడించారు. గృహలక్ష్మి కింద నియోజకవర్గానికి 300 యూనిట్లు కేటాయింపు చేయనున్నట్లు వివరించారు. జిల్లాలో 17 వేల గొర్రెల యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. విడుతల వారికి అర్హులందరికీ అందించే ప్రక్రియ కొనసాగుతున్నదని వివరించారు. మండలంలోని పాలడుగు పెద్ద చెరువు కింద రైతులకు పంట కాల్వల నిర్మాణం కోసం రూ.1.90 లక్షలను మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ రచ్చ కల్పనాలక్ష్మీనర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్పీటీసీ గోరుపల్లి శారదాసంతోష్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డి, ఎంపీడీఓ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**• ఎస్ఐ ముత్తయ్య**

నాగారం, జూలై 19 : నేటి సమాజంలో పెరుగుతన్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ముత్తయ్య అన్నారు. బుధవారం మండలంలోని నాగారం బంగ్లా గ్రామంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. అనుమాన పడేలా అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు తెలుపాలన్నారు. మొబైల్‌కు వచ్చే ఓటీపీలు, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే 1930, 100కు ఫోన్ చేసి తెలుపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటయ్య, గుండగాని యల్లయ్య, ఎండీ.అప్సర్, హుస్సేన్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న బీఆర్ఎస్ కార్మిక విభాగం నియోజకవర్గ బాధ్యుడు సత్యనారాయణగౌడ్

## కార్మిక బీమాపై అవగాహన

మద్దిరాల, జూలై 19 : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కార్మిక సంక్షేమ బీమా పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని బీఆర్ఎస్ కార్మిక విభాగం నియోజకవర్గ బాధ్యుడు గౌడిచర్ల సత్యనారాయణగౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ట్రాన్స్‌ఫోర్ట్ డ్రైవర్లకు అవగాహన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాలు అనుకోకుండా సంభవిస్తాయి కావునా బీమాకు దరఖాస్తు చేసుకుంటే కుటుంబానికి బాసటగా నిలుస్తుందని చెప్పారు. ఈ నెల 27న మద్దిరాల మండల కేంద్రంలో జరిగే ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ యూనియన్ సమావేశానికి ఆటో డ్రైవర్స్, ట్రాన్స్‌పోర్ట్ వెహికిల్స్ డ్రైవర్స్, ట్రాక్టర్ యూనియన్ డ్రైవర్స్ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు భూతం సతీశ్, శ్రీశైలం, శ్రీను, మహేశ్, శ్రీనివాస్, వంశీ, రాజేశ్, వెంకన్న, రమేశ్, మధు పాల్గొన్నారు.

# రైతుల చూపు ఆయిల్‌పామ్ వైపు

**అడ్డగూడూరు మండలంలో 100 ఎకరాల పైనే సాగు**

**ప్రభుత్వ ప్రోత్సాహంతో వాణిజ్య పంటల వైపు రైతుల మొగ్గు**



లక్ష్మీదేవికాల్వలో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోట

అడ్డగూడూరు, జూలై 19 : రాష్ట్రంలోని రైతులు ఆర్థికంగా వృద్ధి చెందాలనే ఉద్దేశంతో వరి, పత్తి పంటలకు ప్రత్యామ్నాయంగా ఇతర వాణిజ్య పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. దిగుబడులు చేతికందేనాటికి వాతావరణం అనుకూలించకపోవడం, శ్రమకి తగిన ఫలితం రాకపోవడం వంటి వాటిని సాంప్రదాయ పద్ధతిలో ఏండ్లుగా చవిచూస్తున్న రైతన్నలు ఆదాయాన్ని ఇచ్చే ఇతర పంటల వైపు క్రమంగా మొగ్గుచూపుతున్నారు. ప్రభుత్వం కూడా రైతుల సాగు కష్టాలు తెలుసుకుని లాభాలు వచ్చే ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలని ప్రోత్సహిస్తున్నది. ఇప్పటికే మండలంలోని రైతులను ఖమ్మం, కొత్తగూడెం, అశ్వారావుపేట ప్రాంతాలకు తీసుకెళ్లి ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించింది. భారీ ప్రోత్సాహకాలతో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నది. ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం సబ్సిడీతో పాటు డ్రిప్ పూర్తిగా ఉచితం. బీసీలకు 90 శాతం మొక్కలు, 80 శాతం డ్రిప్‌కు సబ్సిడీ ఇస్తున్నది. ఒక మొక్కకు రూ.193 ఖర్చు కాగా రైతులకు రూ.20కే అధికారులు అందిస్తున్నారు. ఎకరా ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం ఏడాదికి రూ.4,200 అందజేస్తున్నది.

### ఆయిల్‌పామ్ సాగుతో ఉపయోగాలు..

ఏడాది వయసున్న ఆయిల్‌పామ్ మొక్కలను రైతులకు ఇస్తారు. మొక్కలు నాటిన నాలుగో ఏడాది నుంచి కాపు మొదలవుతుంది. 30 ఏండ్ల పాటు కొనసాగనున్నది. మొదటి మూడేండ్లు అంతర పంటలుగా కూరగాయలు, వేరుశనగ వంటి పంటలను సాగు చేసుకోవచ్చు. ఆయిల్‌పామ్ పంటకు తెగుళ్లు, చీడ పురుగులు, కోతుల బెడద ఉండదు. మొదటి సంవత్సరం ఎకరాకు 6 టన్నుల దిగుబడి వస్తుంది. అనంతరం ఎకరాకు 2 టన్నుల వరకు దిగుబడి పెరుగుతుంది. ఇలా 30 ఏండ్లు కొనసాగనున్నది. ప్రతి 15 నుంచి 20 రోజులకోసారి పంటను కోసుకోవచ్చు. ప్రస్తుతం టన్ను ధర రూ.14 వేల పైనే ఉన్నది. ఎకరాకు చతురస్రాకారంలో 50 మొక్కలు, త్రికోణంలో 57 మొక్కలు నాటుకోవచ్చు.

### రైతుల ఆదాయం పెంచేందుకే..



తెలంగాణలోని రైతుల ఆదాయం పెంచాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ఆయిల్‌పామ్ సాగుకు రాయితీ కల్పిస్తున్నారు. మండలంలో ఇప్పటికే 2022-2023 సంవత్సరంలో 100 ఎకరాలకు పైగా ఆయిల్‌పామ్ సాగు చేపట్టాం. ఇంకా సాగు పెంచేందుకు రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. రైతులు ఎప్పుడూ ఒకే రకమైన పంటలను కాకుండా లాభాలు తెచ్చే పంటలు సాగు చేయాలి.

– కంచర్ల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్

### 15ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు



మండలంలోని లక్ష్మీదేవికాల్వ గ్రామంలో మాకున్న 15 ఎకరాల భూమిలో ఆయిల్‌పామ్ సాగు చేపట్టాం. గతంలో వరి పంట వేసేవాళ్లం. ఆశించిన లాభం రాకపోయేది. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ తోటల పెంపకం కోసం సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహిస్తుండడంతో ఇటువైపు దృష్టిసారించాం. జనవరిలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటాం. అంతర్ పంటగా పత్తి, కంది సాగు చేస్తున్నాం.

– పొన్నాల చంద్రకళ, మహిళా రైతు, లక్ష్మీదేవికాల్వ

### నేడు మద్దిరాలకు ఎమ్మెల్యే కిశోర్ రాక

మద్దిరాల, జూలై 19 : ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ గురువారం మద్దిరాల మండల పర్యటనకు వస్తున్నట్లు రైతు బంధు సమితి జిల్లా కో ఆర్డినేటర్ ఎస్ఏ రజాక్ బుధవారం తెలిపారు. మండల కేంద్రంలో, రెడ్డిగూడెం గ్రామంలో పల్లె దవాఖానల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు.

## సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలి

**• బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సీతయ్య**



తుంగతుర్తి : సమావేశంలో మాట్లాడుతున్న సీతయ్య

తుంగతుర్తి, జూలై 19 : ఈ నెల 24న ముఖ్యమంత్రి కేసీఆర్ సూర్యాపేట పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ నివాసంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలం నుంచి సుమారు 3 వేల మంది కార్యకర్తలు పాల్గొనాలని పేర్కొన్నారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, ఎంపీపీ గుండగాని కవితారాములుగౌడ్, ప్రధాన కార్యదర్శి కటకం వెంకటేశ్వర్లు, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు నల్లు రాంచంద్రారెడ్డి, ఆలయ చైర్మన్ ముత్యాల వెంకటేశ్వర్లు, చెరుకు పరమేశ్, తడకమళ్ల రవికుమార్, తునికి సాయిలు, తునికి లక్ష్మమ్మ, ఎల్లబోయిన భిక్షం, గోపగాని రమేశ్‌గౌడ్, శ్రీను, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్వపల్లి : ఈ నెల 24న జిల్లా కేంద్రంలో జరిగే సీఎం కేసీఆర్ బహిరంగసభను కార్యకర్తలు విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుండగాని సోమేశ్‌గౌడ్ అన్నారు. అర్వపల్లిలో కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నె రేణుకాలక్ష్మీనర్సయ్యయాదవ్, జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, బొడ్డు రామలింగయ్య, బైరబోయిన రామలింగయ్య, ఉప సర్పంచ్ ప్రభాకర్, గ్రామ శాఖ అధ్యక్షుడు కడారి నరేశ్, వల్లపు లింగయ్య, రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.



అర్వపల్లి సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమేశ్‌గౌడ్

## హరితహారంపై అవగాహన

తుంగతుర్తి, జూలై 19 : హరితహారంపై తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా కో ఆర్డినేటర్ వేముల నరేశ్ కళాబృందం మంగళవారం మండలంలోని వెంపటి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించింది. జీవకోటికి ప్రాణధారమైన మొక్కలను పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీమ్ లీడర్ గంట భిక్షపతి, మాడి శంకర్, ఈర్ల సాయి, చిప్పలపల్లి సుధాకర్, పల్స నిర్మల, నెమ్మాది స్రవంతి, సిరిపంగి రాధ, ప్రియదర్శిని, ఇందిరా పాల్గొన్నారు.

## రైతు బీమాకు దరఖాస్తు

నూతనకల్, జూలై 19 : రైతు బీమా కోసం అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి మురళీ బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. 16 జూన్, 2023 ముందు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత పత్రాలతో వ్యవసాయ శాఖ అధికారులకు దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు.

### పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

రైతులు వానకాలం పంటల సాగు వివరాలు నమోదు చేసుకోవాలని ఏఈఓ శ్రావణి అన్నారు. మండలంలోని తాళ్లసింగారం క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో పంటల వివరాలను నమోదు చేశారు. పంటలను నమోదు చేసుకోవడం ద్వారా ఉత్పత్తుల అమ్మకాల సమయంలో అలాగే పంట బీమాకు ఉపయోగపడుతుందని తెలిపారు.